తాళం తీసేదెప్పుడో..!



వడియారం వద్ద ఏర్పాటు చేసిన అర్బన్ ఫారెస్టు పార్కు

ఏమిటి: హెచ్ఎండీఏ అర్బన్ ఫారెస్టు పార్కు
ఎక్కడ: వడియారం, చేగుంట
వెచ్చించిన నిధులు: రూ.1.14 కోట్లు
విస్తీర్ణం: 465 హెక్టార్లు
పనులు షురూ: జూన్' 2019
పూర్తిచేయాల్సింది: రెండేళ్లలో..
ప్రస్తుత పరిస్థితి: పార్కుకు ఎప్పుడు తాళమే

సందర్శకులకు ఆహ్లాదం అందించాలనే ఘనమైన లక్ష్యంతో ఏర్పాటుచేసిన హెచ్ఎండీఏ అర్బన్ ఫారెస్టు పార్కుతో ఐదేళ్లు దాటినా ప్రయోజనం శూన్యం. మొక్కల పెంపకంపై దృష్టి సారించారే తప్ప పర్యాటకులకు మాత్రం ఎలాంటి ఉపయోగం లేకుండా పోయింది. రూ.కోట్లు వెచ్చించినా అనుకున్న లక్ష్యం నెరవేరలేదు. ఇది చేగుంట నుంచి మెదక్ వెళ్లే మార్గంలో వడియారం అటవీ ప్రాంతంలో హెచ్ఎండీఏ ఆధ్వర్యంలో నిర్మించిన ఫారెస్టు అర్బన్ పార్కు పరిస్థితి.

రెండేళ్లలో వసతులు..

2019లో వడియారం అటవీ ప్రాంతంలో అర్బన్‌ఫారెస్టు పార్కును తీర్చిదిద్దాలని హెచ్ఎండీఏ సంకల్పించింది. రెండేళ్లలో అన్ని వసతులు కల్పించి అందుబాటులోకి తీసుకురావాలని లక్ష్యంగా నిర్దేశించగా.. ఆచరణలో మాత్రం సాధ్యం కాలేదు. నేటికీ పూర్తికాకపోవడం గమనార్హం. ఇక్కడ 11 కి.మీ. అటవీ ప్రాంతం చుట్టూ కంచె నిర్మాణం చేపట్టి రక్షణ కల్పించారు. చుట్టూ సౌర విద్యుత్తు దీపాలు వేసేందుకు స్తంభాలు బిగించారు. దీపాలను మరిచిపోయారు.

నడకదారి లేక..

పార్కులో ధ్యాన మందిరం, షెడ్డు, వాచ్‌టవర్ నిర్మించారు. ఆయా చోట్లకు వెళ్లేందుకు సరైన దారులు కరవయ్యాయి. నీటి వసతి, కూర్చునేందుకు కుర్చీలూ లేవు. మొదట్లో ఇక్కడి విస్తీర్ణంలో పది శాతం మేర ఉద్యానాల ఏర్పాటుకు నిర్ణయించారు. ప్రస్తుతం ఆ ఆనవాళ్లే కనిపించడం లేదు. 5 కి.మీ. నడక దారి నిర్మించాల్సి ఉంది. నడుస్తున్నప్పుడు మధ్యలో అలసట వస్తే మరో దగ్గరి దారి నుంచి స్వాగతతోరణానికి చేరుకునేలా మరో మార్గాన్ని నిర్మించలేదు. ఇక్కడ బోర్డు మాత్రం రాసి ఉంచినా ఎప్పుడూ తాళమే వెక్కిరిస్తోంది. ఎవరూ పర్యవేక్షిస్తున్నారో కూడా తెలియని దుస్థితి. కాస్త దృష్టిసారించి పర్యాటకులు వచ్చేలా తీర్చిదిద్దితే ఆదాయం రావడం ఖాయం.

- న్యూస్‌టుడే, చేగుంట

ఏడుపాయలను వీడని వరద



సింగూరు ప్రాజెక్టు నుంచి దిగువకు నీటిని విడుదల చేయడంతో ప్రసిద్ధ ఏడుపాయల వనదుర్గామాత ఆలయం వద్ద మూడు రోజులుగా వరద కొనసాగుతోంది. గురువారం సైతం వరద ప్రవాహం ఉండటంతో తెల్లవారుజామున అర్చకులు మాత్రమే గర్భగుడిలోకి వెళ్లి అమ్మవారికి అభిషేకం, సహస్రనామార్చన చేపట్టాక మూసేశారు. భక్తుల సౌకర్యార్థం రాజగోపురంలో అమ్మవారి ఉత్సవ విగ్రహానికి పూజలు కొనసాగాయి. అక్కడే మాతను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. వనదుర్గా ప్రాజెక్టు నుంచి 15,000 క్యూసెక్కుల వరద దిగువకు వదులుతున్నారు. - న్యూస్‌టుడే, పాపన్నపేట

రేపు విద్యుత్తు వినియోగదారుల ఫోరం సదస్సు

తూప్రాన్: పట్టణంలోని విద్యుత్తు డివిజన్ కార్యాలయం వద్ద ఈనెల 28న ఉదయం 10 నుంచి 2 గంటల వరకు విద్యుత్తు వినియోగదారుల ఫోరం సదస్సు నిర్వహిస్తున్నట్లు డీఈ రాజేందర్ తెలిపారు. తూప్రాన్ విద్యుత్తు డివిజన్ పరిధి తూప్రాన్, కౌళ్లకల్, శివ్వంపేట, వెల్దుర్తి, మాసాయిపేట, చేగుంట, నార్సింగి, రామాయంపేట, నిజాంపేట సెక్షన్ల పరిధిలోని విద్యుత్తు వినియోగదారులు సమస్యలుంటే బిల్లు, ఆధార్ కార్డుతో నేరుగా వచ్చి పరిష్కరించుకోవచ్చని సూచించారు. అధికారులు సకాలంలో హాజరు కావాలని సూచించారు.

వైద్యుల కొరత.. తప్పని నిరీక్షణ

న్యూస్‌టుడే, మెదక్

జిల్లా ఆసుపత్రి, మాతా శిశు సంరక్షణ ఆసుపత్రులలో రోగులు (ఈనెల 1 నుంచి 24 వరకు)
ఔట్‌పేషెంట్ 651 ● ఇన్‌పేషెంట్ 28

కొన్ని రోజులుగా వర్షాలు కురుస్తుండటంతో సర్కారు దవాఖానాలు రోగులతో కిటకిటలాడుతున్నాయి. మొన్నటి వరకు జ్వర బాధితులు భారీగా ఉండగా, ప్రస్తుతం కాస్త తగ్గుముఖం పట్టింది. జిల్లావ్యాప్తంగా మెరుగైన చికిత్స నిమిత్తం మెదక్‌లోని జిల్లా ఆసుపత్రికి పరుగెత్తుకొస్తున్నారు. కానీ వైద్యుల కొరత వేధిస్తోంది. పూర్తి స్థాయిలో వైద్యులు లేకపోవడంతో ఉన్న వారిపైనే అదనపు భారం పడుతోంది. ఈ నేపథ్యంలో ఇక్కడి పరిస్థితిపై కథనం.

మెదక్‌లోని జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో 130 పడకల సామర్థ్యం ఉంది. జిల్లా కేంద్రం చుట్టూ ఉన్న పది మండలాలతో పాటు కామారెడ్డి జిల్లా నాగిరెడ్డిపేట, ఎల్లారెడ్డి మండలాల నుంచి సైతం రోగులు వస్తుంటారు. వర్షాలు కురవడంతో కొన్ని రోజులుగా జిల్లా ఆసుపత్రికి సగటున 400 మంది పైగా రోగులు వస్తుండటం గమనార్హం.

ప్రైవేటులో కొనుగోలు..

ప్రస్తుతం విష జ్వరాలు వ్యాపిస్తున్న తరుణంలో జ్వర బాధితులే ఎక్కువగా వస్తున్నారు. ఆసుపత్రిలో పూర్తిస్థాయిలో ఔషధాలు అందుబాటులో ఉంచాల్సి ఉండగా, కొన్ని లేకపోవడంతో రోగులు ప్రైవేటు బాట పడుతున్నారు. ప్రధానంగా పారాసెటమాల్ ఇంజక్షన్లు అందుబాటులో లేక బయట నుంచి తెప్పించాల్సిన పరిస్థితి. నిత్యం 100 నుంచి 200 వరకు ఇంజక్షన్లు అవసరం ఉంటున్నాయి. వీటిని స్థానికంగా కొనుగోలు చేసి రోగులకు ఇస్తున్నారు. మరి కొన్ని ఔషధాలు సైతం లేవు.



నమూనాలు ఇచ్చేందుకు వేచి ఉన్న రోగులు

ఫలితం ఆలస్యం..

జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలోనే డయగ్నోస్టిక్ హబ్ ఉంది. జిల్లాలోని 25 ప్రభుత్వ ఆసుపత్రుల నుంచి నిత్యం ఇక్కడికి నమూనాలు వస్తున్నాయి. ఆయా చోట్లకు వస్తున్న రోగుల నుంచి నమూనాలు సేకరించి హబ్‌కు పంపిస్తున్నారు. 24 గంటల తర్వాత ఫలితం వెల్లడిస్తున్నారు. ఇన్‌పేషెంట్ల నమూనాలు తీసుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. కొద్ది రోజుల క్రితం ఆసుపత్రిని కలెక్టర్ రాహుల్‌రాజ్ తనిఖీ చేసినప్పుడు ఒకరు ఆసుపత్రిలో చేరి రెండు రోజులైనా నమూనా సేకరించలేదనే విషయం తేలింది. సకాలంలో ఫలితాలు ఇస్తే చికిత్స అందుతుంది.

విభాగం	పరీక్షలు	పాజిటివ్ నిర్ధారణ
టైఫాయిడ్	1,608	24
డెంగీ	1,556	1
మలేరియా	450	0
చికెన్‌గన్యా	403	0
జ్వరం	35	–



జిల్లా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులు

47 మందికి 21 మందే..

జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యుల కొరత నెలకొంది. 47 పోస్టులు మంజూరు కాగా ప్రస్తుతం 21 మంది మాత్రమే ఉన్నారు. మరో 26 మంది వైద్యులు లేరు. ప్రధానంగా ఇద్దరు జనరల్ సర్జన్లు, ఇద్దరు ఫిజీషియన్లు, రేడియాలజిస్ట్ అవసరం.

ఇబ్బందులు లేకుండా..: కిరణ్ కుమార్, పర్యవేక్షకుడు, జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి

ఆసుపత్రికి కొన్ని రోజులుగా జ్వర బాధితులు తక్కువగా వస్తున్నారు. ఇన్, ఔట్ పేషెంట్లకు మెరుగైన వైద్యం అందిస్తున్నాం. కొన్ని ఔషధాలు సరఫరా కాకపోయినా, కొనుగోలు చేసి ఇస్తున్నాం.

ఉపాధ్యాయ సర్దుబాటు జీవోను సవరించాలి



నర్సింహారెడ్డికి వినతిపత్రం ఇస్తూ..

వెల్దుర్తి: ఉపాధ్యాయుల సర్దుబాటు జీవో 25ను వెంటనే సవరించాలని ఎస్టీటీయూ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కరివేద మహిపాల్‌రెడ్డి, అరికెల వెంకటేశం గురువారం హైదరాబాద్‌లో రాష్ట్ర విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి వెంకటేశం, డైరెక్టర్ నర్సింహారెడ్డికి వినతిపత్రాలు ఇచ్చారు. అనంతరం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డిని కలిశారు. ఎస్టీటీలకు ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటుహక్కు కల్పించాలని విన్నవించారు. సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు శ్రీరాం శ్రీనివాస్, ప్రవీణ్‌కుమార్ రెడ్డి, మురళీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉద్యోగులకు సన్మానం

శివ్వంపేట: స్వయం సహాయక సంఘాలకు లక్ష్యాన్ని మించి 167 శాతం రుణాలిచ్చి జిల్లాలోనే శివ్వంపేటను తొలి స్థానంలో నిలిపినందుకు ఐకేపీ ఏపీఎం వెంకటేశ్వర్లు, మండల సమాఖ్య అధ్యక్షురాలు నవనీతను కలెక్టర్ రాహుల్‌రాజ్ గురువారం మెదక్‌లో సత్కరించారు. 762 స్వయం సహాయక సంఘాలకు రూ.37.38 కోట్లు రుణాలిచ్చి ప్రథమ స్థానంలో నిలిపారన్నారు.

పదోన్నతితో మరింత బాధ్యత: ఎస్పీ



ఎస్పీ ఉదయ్‌కుమార్ రెడ్డితో ఏఆర్ ఎస్ఐలు

మెదక్, న్యూస్‌టుడే: పదోన్నతితో ఉద్యోగం పట్ల మరింత బాధ్యత పెరుగుతుందని ఎస్పీ ఉదయ్ కుమార్‌రెడ్డి సూచించారు. ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ నుంచి ఏఆర్ ఎస్ఐలుగా పదోన్నతి పొందిన జె.వెంకట రాములు, జె. లక్ష్మీనారాయణ గురువారం మెదక్‌లోని జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీని మర్యాదపూర్వకంగా కలిశారు. క్రమశిక్షణతో విధులు నిర్వర్తిస్తూ సర్వీస్‌లో మరిన్ని పదోన్నతులు పొందాలని, పోలీస్ శాఖకు మంచి పేరు తెచ్చుకోవాలని ఎస్పీ సూచించారు. అదనపు ఎస్పీ (అడ్మిన్) మహేందర్, సాయుధదళ డీఎస్పీ రంగనాయక్, ఆర్ఐ శైలేందర్, భవానీకుమార్ పాల్గొన్నారు.

సార్వత్రిక విద్య చక్కటి వరం



గోడపత్రికను ఉపాధ్యాయులతో కలిసి విడుదల చేస్తున్న డీఈవో రాధాకిషన్

వెల్దుర్తి, న్యూస్‌టుడే: విద్యార్థులు గుణాత్మకంగా అభివృద్ధి చెందేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని డీఈవో రాధాకిషన్ సూచించారు. గురువారం వెల్దుర్తి ఉన్నత పాఠశాలలో నిర్వహించిన పాఠశాలల సముదాయ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. సముదాయ సమావేశాలకు ఉపాధ్యాయులంతా హాజరు కావాలని చెప్పారు. బడుల నిర్వహణను మెరుగుపర్చాలన్నారు. సార్వత్రిక విద్యతో ఎన్నో ప్రయోజనాలున్నాయన్నారు. 14 ఏళ్లు నిండి మధ్యలో చదువు మానేసిన విద్యార్థులకు ఇదో చక్కటి వరమన్నారు. అనంతరం సార్వత్రిక విద్యకు సంబంధించిన గోడపత్రికలను ఉపాధ్యాయులతో కలిసి విడుదల చేశారు. ప్రధానోపాధ్యాయుడు సాంబయ్య, తదితరులు పాల్గొన్నారు.

రోగులకు సరైన వైద్యం అందించండి



రోగులతో మాట్లాడుతున్న జిల్లా వైద్యాధికారి శ్రీరామ్

కొల్చారం, న్యూస్‌టుడే: రోగులకు సరైన వైద్యం అందించాలని జిల్లా వైద్యాధికారి శ్రీరామ్ అన్నారు. గురువారం ఆయన కొల్చారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. రోగులతో మాట్లాడి సరైన వైద్యం అందుతుందా.. అని అడిగి తెలుసుకున్నారు. మందుల పంపిణీ దస్త్రాలు, ల్యాబ్ తనిఖీ చేశారు. కార్యక్రమంలో ప్రోగ్రామ్ అధికారి నవీన్‌కుమార్, వైద్యాధికారి రమేశ్ పాల్గొన్నారు.

బాధ్యతగా పని చేయండి: మంత్రి



మాట్లాడుతున్న మంత్రి కొండా సురేఖ, వేదికపై కలెక్టర్ రాహుల్‌రాజు, ఎంపీ రఘునందన్‌రావు, ఎమ్మెల్సీలు సుభాష్‌రెడ్డి, యాదయ్య, ఎమ్మెల్యేలు సునీతాడ్డి, రోహిత్‌రావు, సంజీవరావు, వెంకటయ్య



పాల్గొన్న అధికారులు

మెదక్, న్యూస్‌టుడే: ప్రజాధనంతో వేతనాలు తీసుకుంటున్నాం.. సమస్యలు పరిష్కరించి, అభివృద్ధిని ముందుకు తీసుకెళ్లాలని రాష్ట్ర అటవీ, పర్యాటక, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అధికారులకు సూచించారు. బాగా పని చేసే అధికారులకు ప్రోత్సహిస్తామని స్పష్టంచేశారు. గురువారం మెదక్ కలెక్టరేట్‌లో జిల్లా అభివృద్ధి-సంక్షేమ పథకాలపై ఆమె సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీ సూచించే పనులపై నిర్లక్ష్యం వహించొద్దని ఆదేశించారు. జిల్లా అభివృద్ధిపై మూడు నెలలకోసారి సమీక్ష చేపట్టనున్నట్లు తెలిపారు. ప్రతి నియోజకవర్గానికి 3,500 ఇళ్లు కేటాయిస్తామన్నారు.

క్షేత్రస్థాయిలో విచారించి..: పోడు భూముల పట్టాలు పొందిన వారి పొలాల్లో పంటల సాగుకు నీటి వసతి కల్పించాలన్నారు. అటవీ, రెవెన్యూ శాఖల మధ్య వివాదం నెలకొన్న భూములపై విచారించాలని ఆదేశించారు. వనమహోత్సవంలో నిర్దేశించిన లక్ష్యం చేరుకోకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రైవేటు పాఠశాలల్లో ఇష్టారీతిగా ఫీజులు వసూలు చేయకుండా కట్టడి చేయాలని, ప్రైవేటు ఆసుపత్రుల్లో సాధారణ కాన్పులు జరిగేలా దృష్టి సారించాలని స్పష్టంచేశారు.

- ధాన్యం కొనుగోళ్లకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలుతీసుకోవాలని మంత్రి ఆదేశించారు. బతుకమ్మ నేపథ్యంలో చెరువుల వద్ద ఏర్పాట్లు చేయాలని డీపీవో యాదయ్యను ఆదేశించారు. పర్యాటకాభివృద్ధికి ప్రతిపాదించాలని కలెక్టర్ రాహుల్‌రాజ్‌కు సూచించారు. ఏడుపాయల ఆలయాభివృద్ధికి నిధులు మంజూరు చేస్తామన్నారు. నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి మాట్లాడుతూ.. కొనుగోలు కేంద్రాల్లో తరుగు తీస్తున్నారన్నారు. చిన్నశంకరంపేట మండలం ఎస్.కొండాపూర్‌లో అటవీ, రెవెన్యూ శాఖల మధ్య వివాదాన్ని పరిష్కరించాలని ఎమ్మెల్సీ సుభాష్‌రెడ్డి కోరారు. ఎమ్మెల్సీ యాదవరెడ్డి, అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, తూప్రాన్ మున్సిపల్ చైర్‌పర్సన్ జ్యోతి పాల్గొన్నారు.

రైతులను ఇబ్బందులు పెట్టొద్దు

– రఘునందన్ రావు, మెదక్ ఎంపీ

ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో తేమ కొలిచే యంత్రాలు సరిగా పని చేయడం లేవు. రైతులను ఇబ్బందులు పెట్టొద్దు. చేగుంటలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలి. వడియారం వద్ద పర్యాటకంగా అభివృద్ధి చేయాలి. నర్సాపూర్ అటవీ ప్రాంతంలో రోడ్లపైకి వానరాలు వస్తున్నాయి.

ఏడుపాయలకు నిధులు

– రోహిత్‌రావు, మెదక్ ఎమ్మెల్యే

ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ఏడుపాయల ఆలయానికి గతంలో రూ.100 కోట్లు కేటాయించారు. అవి రద్దయ్యాయి. తిరిగి నిధులు మంజూరు చేయాలి. గత జాతరలో చేసిన పనులకు సంబంధించి బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. గ్రామాలకు ఆర్టీసీ బస్సులు వెళ్లడం లేదు.

పట్టా పుస్తకాలు లేక..

– సునీతా లక్ష్మారెడ్డి, నర్సాపూర్ ఎమ్మెల్యే

పోడు భూములకు సంబంధించి మండలానికి రెండు గ్రామాలను నమూనాగా ఎంపిక చేశారు. దీంతో ఎస్టీలకు రుణమాఫీ కాలేదు. పట్టా పుస్తకాలు సకాలంలో అందని వారంతా ధాన్యం విక్రయానికి ఇబ్బందులు పడుతున్నారు. మిల్లర్లు ధాన్యం త్వరగా తీసుకునేలా చర్యలు తీసుకోవాలి.

ముఖాముఖికి 91 మంది హాజరు



అభ్యర్థుల ధ్రువపత్రాలు పరిశీలిస్తున్న అధికారులు

మెదక్ టౌన్, న్యూస్‌టుడే: ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న ఆయుష్ ఆరోగ్య కేంద్రాల్లో యోగా శిక్షకులకు గురువారం మెదక్‌లోని ఆయుర్వేద వైద్యశాలలో ముఖాముఖి నిర్వహించారు. మూడు జిల్లాల నుంచి 91 మంది హాజరయ్యారు. డైరెక్టర్ ఆఫ్ ఆయుష్ కమిషన్ ద్వారా నియంచిన కమిటీ ఆధ్వర్యంలో ఎంపిక కొనసాగింది. ఈ సందర్భంగా కమిటీ అధ్యక్షుడు ఆయుష్ ఏడీ డాక్టర్ వసంతరావు మాట్లాడుతూ.. రోగాల నుంచి ప్రజలు ఉపశమనం పొందేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా యోగ శిక్షణ కార్యక్రమాలకు శ్రీకారం చుట్టిందన్నారు. స్థానిక పరిస్థితులకు అనుగుణంగా శిక్షకులు తరగతులను ఉచితంగా నిర్వహిస్తారన్నారు. కమిటీ కన్వీనర్, వరంగల్ ఆర్డీడీ డాక్టర్ ప్రమీలాదేవి, జిల్లా ఆయుష్ వైద్యాధికారి మనోహర్‌రెడ్డి, నేచురోపతి వైద్యుడు దేవయ్య, మెదక్, సర్దన, సిద్దిపేట, సంగారెడ్డి ఆయుష్ వైద్యాధికారులు మధుమిత, విజ్ఞత, ఉమాదేవి, నర్మద షిండే తదితరులు పాల్గొన్నారు.



నింగి మేఘమాల.. నేల హరితహేల

చిత్రం చూడండి.. నింగిన మేఘమాల కనువిందు చేస్తుండగా.. నేలపై నాటి సంరక్షించిన మొక్కలన్నీ ఆకాశానికేసి చూస్తున్నాయి. గురువారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో భారీ వర్షం కురిసేలా ఆకాశం మేఘావృతమైంది. మెదక్ కలెక్టరేట్ వద్ద ఈ దృశ్యం ఆవిష్కృతమైంది.

– న్యూస్‌టుడే, మెదక్



గతంలో రోడ్డుకు ఇరువైపులా పచ్చని చెట్లు

ఏళ్లనాటి వృక్షాలు కనుమరుగు

హవేలిఘనపూర్ మండలంలో చేపడుతున్న 765(డి) జాతీయ రహదారి విస్తరణలో భాగంగా వందల సంఖ్యలో భారీ వృక్షాలను తొలగించారు. దీంతో ఏళ్ల నాటి వృక్షాలు కనుమరుగవుతున్నాయి. గతంలో రోడ్డుకు ఇరువైపులా ఆహ్లాదకరమైన వాతావరణం ఉండేది. ఈ చెట్లను తొలగించడంతో పచ్చదనం కోల్పోయామనే భావన అందరిలో కనిపిస్తోంది. - న్యూస్‌టుడే, హవేలిఘనపూర్



తొలగించిన తర్వాత ఇలా...

ప్రతిభను వెలికితీసే కళా ఉత్సవ్

న్యూస్‌టుడే, మెదక్ టౌన్

విద్యార్థులు ఓ వైపు చదువుతో పాటు వారికి ఆసక్తి ఉన్న కళల్లోనూ ప్రతిభ చాటుతున్నారు. అలాంటి వారికి సరైన ప్రోత్సాహం కరవై గుర్తింపు లభించడం లేదు. ప్రధానంగా గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఈ సమస్య ఎదురవుతోంది. ఇలాంటి వారి కోసమే ఎన్‌సీఈఆర్టీ, తెలంగాణ సమగ్ర శిక్షా అభియాన్ సంయుక్తాధ్వర్యంలో ఒక వేదిక తీసుకొచ్చారు. కళాఉత్సవ్ పేరిట విద్యార్థులకు పోటీలు నిర్వహిస్తున్నారు. ఈ మేరకు 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించిన ప్రస్తుత పోటీలు కొనసాగుతున్నాయి. జిల్లావ్యాప్తంగా 9, 10వ తరగతులతో పాటు ఇంటర్ విద్యార్థులు పాల్గొంటున్నారు. విజేతలకు ప్రోత్సాహకాలు అందించనున్నారు.



విద్యార్థినుల నృత్యప్రదర్శన

ఆరింట మాత్రమే..

గతంలో కళాఉత్సవ్‌లో పది రకాల కళల్లో పోటీలు నిర్వహించారు. ఈ సారి మాత్రం ఆరింటికే పరిమితం చేశారు. స్వర సంగీతం, వాయిద్య సంగీతం, నృత్యం, థియేటర్, దృశ్యకళ, సంప్రదాయ కథ చెప్పడం వంటి అంశాలపై ప్రధానంగా పోటీలు కొనసాగుతున్నాయి. వీటిలో ఉప అంశాలుగా జానపద, క్లాసికల్ నృత్యాలు, సంగీతం, సంప్రదాయ చిత్రాలు, హిందూస్థానీ, కర్ణాటక, చిత్రలేఖనం, శిల్పకళ, నాటకం, కథలు చెప్పడం వంటివి నిర్దేశించారు. ఒక పాఠశాల ఒక అంశంలో మాత్రమే పాల్గొనే అవకాశం ఇచ్చారు. ఇలా ఆరు అంశాల్లో ఆరు టీంలు బృంద, వ్యక్తిత పోటీల్లో పాల్గొనేందుకు వీలుంది.

మండల స్థాయిలో పోటీలు..

ముందుగా మండల స్థాయిలో పోటీలు జరుగుతున్నాయి. రెండు రోజుల్లో ముగించనున్నారు. ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులను జిల్లాస్థాయికి ఎంపిక చేస్తారు. జిల్లాస్థాయి పోటీలు త్వరలో మెదక్‌లో జరుగనున్నాయి. ఇక్కడ విజేతలుగా నిలిచిన వారు అక్టోబరులో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారు. నిర్వాహకులను ఆకట్టుకున్న వారు నవంబరులో జరిగే జాతీయస్థాయి పోటీలకు ఎంపికవుతారు.

జాతీయస్థాయికి..:




వివిధ కళల్లో విద్యార్థులు తమ ప్రతిభ చాటేందుకు కళా ఉత్సవ్ చక్కటి వేదిక. గతేడాది జిల్లా నుంచి 28 మంది రాష్ట్ర స్థాయిలో పాల్గొన్నారు. ఈ సారి జాతీయ స్థాయికి ఎంపికయ్యేలా కసరత్తు చేస్తున్నాం. మండలాల్లో ప్రక్రియ పూర్తవగానే జిల్లాస్థాయి పోటీలు జరుగుతాయి.

– సుదర్శనమూర్తి, విద్యాశాఖ సెక్టోరల్ అధికారి, మెదక్

దర్శనీయం.. తీర్చిదిద్దితే పర్యాటకం

విశేషాల వేదికగా ఉమ్మడి మెదక్, వికారాబాద్ జిల్లాలు





ఆనందం, ఆహ్లాదం సొంతం చేసుకునేందుకు నచ్చిన ప్రదేశాన్ని సందర్శిస్తుంటాం. సంస్కృతి, సంప్రదాయం, ఆధ్యాత్మిక వారసత్వ కట్టడాలు, జల వనరులు, ప్రాజెక్టులు, అటవీ ఇతర ప్రాంతాలు... ఎన్నో పర్యాటకంగా అలరింపచేస్తున్నాయి. ఉమ్మడి మెదక్, వికారాబాద్ జిల్లాల్లోనూ ఎన్నో ప్రాంతాలు పేరొందాయి. పెరుగుతున్న జనాభా, ప్రత్యేక పరిస్థితుల నేపథ్యంలో సందర్శనీయ ప్రాంతాలను సుందరీకరించాలని జిల్లావాసులు కోరుకుంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తే ప్రజలకు ఆహ్లాదం, ప్రభుత్వానికి ఆదాయం పెరగడం ఖాయం. నేడు ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా 'న్యూస్‌టుడే' ప్రత్యేక కథనం.

అభివృద్ధి అవశ్యం

గజ్వేల్: 50 టీఎంసీల సామర్థ్యంతో గజ్వేల్-దుబ్బాక నియోజకవర్గాల మధ్య నిర్మించిన కొమురవెల్లి మల్లన్నసాగర్‌ను పర్యాటకంగా తీర్చిదిద్దేందుకు గతంలో ప్రతిపాదనలు పంపించగా కార్యరూపం దాల్చలేదు. 23 కి.మీ. పొడవుతో నిర్మించిన భారీ ఎత్తున కట్ట, ఒక పక్క కొండలు, చెట్లతో ఆహ్లాదం పంచే ఈ ప్రాజెక్టును చూసేందుకు రాష్ట్ర నలుమూలల నుంచి సందర్శకులు వస్తున్నారు. సౌకర్యాల కరవుతో సందర్శకులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. మత్స్య సంపద, ప్రాజెక్టు చెంతన పచ్చని పొలాలు, ప్రకృతి రమణీయత ఉట్టిపడే ఇక్కడి అందాలను తనివితీరా చూడవచ్చు. జలాశయం వద్ద వసతుల కల్పనతో ఆదాయం ఖాయం.



చరిత్ర ఆనవాళ్లు పదిలం

కొండాపూర్: శాతవాహనుల కాలంలో వెలిగిన కొండాపూర్‌లో నేలమాళిగల అవశేషాలెన్నో లభ్యమయ్యాయి. అప్పటి నాణేలు, ఆభరణాలు కూడా బయల్పడ్డాయి. గొప్ప బౌద్ధ క్షేత్రంగా విలసిల్లినట్లు ఆధారాలెన్నో ఉన్నాయి. ఆదిమానవుల ఆనవాళ్లూ తవ్వకాల్లో బయల్పడ్డాయి. రాతి యుగం నాటి పనిముట్లు లభించాయి. వాటితో మ్యూజియం ఏర్పాటుచేశారు. సందర్శకులను ఆకట్టుకునేలా తీర్చిదిద్దాలి. భోజనశాల ఏర్పాటు చేస్తే బాగు.



మొసళ్ల అభయారణ్యం

సంగారెడ్డి టౌన్: సంగారెడ్డి మండలం కల్పగూరు శివారులో మంజీర జలాశయాన్ని 1978లో వన్యప్రాణి అభయారణ్యంగా గుర్తించారు. ఇక్కడ 580 మొసళ్లు ఉన్నట్లు అధికారుల లెక్క. మొసళ్ల సంతాన వృద్ధి కేంద్రం కూడా ఇక్కడ ఉంది. రాంసర్ సైట్‌గా గుర్తింపునకు ప్రతిపాదనలు పంపారు. ఆమోదిస్తే జాతీయ స్థాయిలో గుర్తింపు రానుంది. సందర్శకులకు అన్ని వసతులు కల్పించాలి. చిన్నారులు ఆడుకునేలా ఏర్పాట్లు చేయాలి. పార్కును విస్తరించాలి.



'సాగర్'ను తీర్చిదిద్దితే..

సిద్దిపేట: సిద్దిపేటకు సమీపంలో 3 టీఎంసీల సామర్థ్యంతో రంగనాయక సాగర్‌ను నిర్మించారు. దీని మధ్య ద్వీపం (45 ఎకరాలు) ప్రత్యేక ఆకర్షణ. ఇక్కడ వసతి కల్పనకు దోహదం చేసేలా సుమారు 8.65 కి.మీ. కట్ట తీర్చిదిద్దారు. నిత్యం 200 మంది వరకు సందర్శిస్తున్నారు. పర్యాటకులకు వసతులు కరవయ్యాయి. ప్రత్యేక నిర్మాణాలు లేవు. ప్రీ వెడ్డింగ్, లఘుచిత్రాలు, ఇతర వాటికి వేదికైంది. నైట్ రైడింగ్ పోటీలకు అనువైన వాతావరణం ఉంది. పర్యాటక రంగ అభివృద్ధికి గతేడాది రూ.125 కోట్లు వెచ్చించి పనులు ప్రారంభించినా, అవి నిలిచిపోయాయి. వీటిని పూర్తిచేస్తే ఉమ్మడి జిల్లా, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, హైదరాబాద్ నుంచి పర్యాటకులు వచ్చే అవకాశం ఉంది.

జిల్లాల సరిహద్దులో..




పోచారం వన్యప్రాణి అభయారణ్యం

మెదక్, హవేలిఘనపూర్: మెదక్, కామారెడ్డి జిల్లాల సరిహద్దుల్లో ఉన్న పోచారం అభయారణ్యం, పోచారం ప్రాజెక్టు వద్ద సరైన వసతులు కరవయ్యాయి. వారాంతం, సెలవు రోజుల్లో 500 మంది వరకు వస్తున్నారు. పార్క్ షికారుకు వెళ్లేందుకు మట్టి దారే ఉంది. దాన్ని బాగు చేయాలి. తాగునీటి వసతి కల్పించాలి. బోటింగ్ సౌకర్యం సైతం లేదు. శిథిలావస్థలో ఉన్న పురాతన కట్టడాలను బాగు చేయించాలి. కన్నార్జు కింద ప్రతిపాదించినా ఆమోదముద్ర పడలేదు.

రూపు మారిస్తేనే..

మెదక్, పాపన్నపేట: మెదక్ జిల్లాలో ప్రసిద్ధ ఏడుపాయల వనదుర్గమ్మ పుణ్యక్షేత్రానికి ఏటా రూ.7 కోట్ల ఆదాయం సమకూరుతోంది. ప్రస్తుతం 45 వరకు సత్రాలు ఉన్నాయి. దాత సాయంతో ఒక తాగునీటి ప్లాంట్ ఏర్పాటు చేశారు. నిత్యం వెయ్యి మందికిపై దర్శించుకుంటున్నారు. భక్తుల సౌకర్యార్థం కాటేజీలు నిర్మించాలి. సేదతీరేలా పెద్దహాల్ మాదిరిగా నిర్మించాలి. పార్కింగ్ స్థలాలు లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. వీటిపై దృష్టిసారించాల్సిన అవసరం ఉంది.



సేదతీరేలా..

ధారూర్: వికారాబాద్ జిల్లా కేంద్రానికి కోట్‌పల్లి ప్రాజెక్టు 20 కి.మీ. దూరంలో ఉంటుంది. అనంతగిరి అనంతపద్మనాభ స్వామిని దర్శించుకుని ఇక్కడికి వస్తుంటారు. వారాంతాల్లో 500 మందికిపైగా సందర్శిస్తున్నారు. సరైన సౌకర్యాలు లేక ఇబ్బందులకు గురవుతున్నారు. తాగునీరు, మరుగుదొడ్లు, సేదతీరేందుకు బెంచీలు ఏర్పాటు చేయాలి. పార్కు, పిల్లలు ఆడుకునేలా వస్తువులు అందుబాటులోకి తీసుకొస్తే బాగు. ప్రాజెక్టులో బోటింగ్ సౌకర్యం మాత్రమే ఉంది. ఈత కొలను ఏర్పాటుకు డిమాండ్ ఉంది.



బాల మణిపూసలు

సాహిత్యంలో కవిత్వానిది కీలక పాత్ర. సామాజిక అంశాలను సరళ పదాలతో వ్యక్తపరిచి ఆలోచింపజేయడం కవిత్వం ప్రత్యేకత. తెలుగు భాషపై కొంత పట్టు ఉంటేనే ఇది సాధ్యమవుతుంది. ఈ విషయాన్ని గ్రహించారు తెలుగు ఉపాధ్యాయుడు వడిచర్ల సత్యం. విద్యార్థి దశలోనే తెలుగు కమ్మదనాన్ని తెలియపరిచి వారిలో ఆసక్తిని పెంచేందుకు కృషి చేశారు. భాషపై మమకారాన్ని పెంచి.. వారితో అక్షర సుమాలను పేర్పించారు. ఉపాధ్యాయుడి సంకల్పాన్ని అందుకున్న చిన్నారులు నిరంతరం సాధన చేసి అక్షరాలకు హారతి పట్టారు. వారే జహీరాబాద్ మండలం గొట్టిగారిపల్లి ఉన్నత పాఠశాల విద్యార్థులు. 51 మంది చిన్నారులు రాసిన 450 కవితలు 'గొట్టిగారిపల్లి మణిపూసలు' పేరిట గ్రామపెద్దలు, ఉపాధ్యాయుల సహకారంతో పుస్తక రూపం దాల్చాయి. ఆరు నుంచి పదోతరగతి చిన్నారులు ఇందులో భాగస్వామ్యం అయ్యారు. ఎమ్మెల్యే మాణిక్‌రావు పుస్తకాన్ని శుక్రవారం ఆవిష్కరించనున్నారు. వడిచర్ల సత్యం ఇప్పటి వరకు 12 పుస్తకాలకు పైగా రాశారు. ఈ సారి విద్యార్థులతో రాయించడమే లక్ష్యంగా ముందుకు సాగారు. - న్యూస్‌టుడే, పాత తాండూరు, జహీరాబాద్



రాసిన పుస్తకాలతో విద్యార్థులు

చిన్నారులతో రాయించడం సంతృప్తినిచ్చింది: వడిచర్ల సత్యం

నేను రాయడం కంటే నావద్ద చదువుకున్న విద్యార్థులంతా కవితలు రాసి, వినిపించడం సంతృప్తినిచ్చింది. వాటిని ఒక చోట చేర్చి, పుస్తకంగా రూపొందించాం. తెలుగు భాష ఉన్నతికి, బాలల్లో భాషా నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు కృషి చేయాలన్నదే నా ధ్యేయం.

16 ఏళ్లకు పండగ

● ఉమ్మడి మెదక్ జిల్లాలో 292 మందికి దక్కనున్న ఉద్యోగాలు



ఉమ్మడి రాష్ట్రంలో నిర్వహించిన డీఎస్సీ-2008 అభ్యర్థుల విషయమై రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో వెట్టికేకకు ఊరట లభించింది. డీఈడీ అభ్యర్థుల కన్నా మెరిట్ ఉన్న బీఈడీ అభ్యర్థులను ఒప్పంద పద్ధతిలో సెకండరీ గ్రేడ్ టీచర్లు(ఎస్జీటీ)గా నియమించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నెల 24న సదరు నిర్ణయం తీసుకోగా.. సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. ఈ నిర్ణయంతో అప్పటి అభ్యర్థులకు ఒప్పంద కొలువులు దక్కనున్నాయి. దీని వల్ల ఉమ్మడి జిల్లాలో 292 మంది ప్రయోజనం పొందనున్నారు.

30 శాతం మేర..

డీఎస్సీ 2008 నియామకాల చివరి నిమిషంలో 30 శాతం పోస్టులను డీఈడీ అభ్యర్థులకు కేటాయించడంతో బీఈడీ అభ్యర్థులు తీవ్రంగా నష్టపోయారు. డీఈడీ అభ్యర్థుల కన్నా ఎక్కువ మార్కులు వచ్చినా ఉద్యోగాలు రాలేదు. తమకు అన్యాయం జరిగిందంటూ నష్టపోయిన వారంతా అప్పట్లో ఆందోళనకు దిగారు. అప్పటి నుంచి న్యాయ పోరాటం చేస్తున్నారు. ఈ క్రమంలో తాజాగా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో సిద్దిపేట, సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో 292 మందికి ఉద్యోగాలు దక్కనుండటం విశేషం.

27 నుంచి పరిశీలన..

అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని నెరవేరుస్తూ తీసుకున్న నిర్ణయంతో 16 ఏళ్ల తర్వాత ఒప్పంద ఉపాధ్యాయ కొలువులు దక్కనున్నాయి. వీరికి నెలకు రూ. 31,030 చొప్పున వేతనం చెల్లించనున్నారు. కొలువులకు ఎంపికైన అభ్యర్థుల జాబితాను ఉమ్మడి జిల్లాల వారీగా డీఈవో కార్యాలయాల్లో విడుదల చేశారు. వాటిలో పేర్లున్న అభ్యర్థులు ఈ నెల 27 నుంచి వచ్చే నెల 5 వరకు జరిగే ధ్రువపత్రాల పరిశీలనకు సిద్ధం కావాలన్నారు. విద్యాశాఖ వెబ్‌సైట్‌లో ఉంచిన వెరిఫికేషన్ పత్రాన్ని డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. జాబితాలో పేర్లున్న వారిలో కొందరు ఇప్పటికే ఇతర ఉద్యోగాలు చేస్తున్నారు. మరికొందరు ఇతర రంగాలు, వృత్తుల్లో స్థిరపడ్డారు. మరి అప్పుడు ఎంత మంది ఒప్పంద ఎస్జీటీ ఉపాధ్యాయులుగా చేరుతారో అన్నది వేచి చూడాలి. ఇదిలా ఉండగా వీరిని ఏ పాఠశాలలకు కేటాయిస్తారు, ప్రస్తుతం జిల్లాలో ఖాళీగా ఉన్న ఎస్జీటీ పోస్టుల్లో నియమిస్తారా, లేదా ప్రత్యేక పోస్టులేమైనా సృష్టిస్తారా అన్నది తేలాల్సి ఉంది.

- న్యూస్‌టుడే, హుస్నాబాద్ గ్రామీణం

వేడుకలకు చర్చి ముస్తాబు



చర్చి ప్రాంగణంలో వేదిక ఏర్పాట్లు

చర్చి ఆఫ్ సౌత్ ఇండియా (సీఎస్ఐ) కూటమి, స్త్రీ మైత్రి సంఘం ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని మెదక్ సీఎస్ఐ చర్చిలో ఏర్పాట్లు పూర్తి చేశారు. నేడు (శుక్రవారం) నిర్వహించే ఈ వేడుకలకు మెదక్ డయాసిస్ పరిధిలోని ఉమ్మడి మెదక్ జిల్లాతో పాటు నిజామాబాద్, ఆదిలాబాద్, రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల నుంచి భక్తులు వేలాదిగా తరలి రానున్నారు. డిప్యూటీ మోడరేటర్, మెదక్ ఇన్‌ఛార్జి బిషప్ డా.కె. రూబెన్ మార్క్ ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించనున్నారు. వేదిక ప్రాంగణంలో సీఎస్ఐ, స్త్రీ మైత్రి సంఘం పతాకాల ఆవిష్కరణ, అనంతరం ప్రత్యేక ప్రార్థనలు చేపట్టనున్నారు.

ఆసుపత్రికి పూర్వవైభవం: సుమారు 20 ఏళ్ల కిందట వైద్య సేవలు అందించి మూతపడిన మెదక్ సీఎస్ఐ మిషన్ ఆసుపత్రికి పూర్వవైభవం రానుంది. బిషప్ బంగ్లా వెనుకాల కొనసాగిన ఈ ఆసుపత్రి నేడు చర్చి ప్రధాన ద్వారం వద్ద నిర్మించిన భవనంలో ప్రారంభించనున్నారు. భక్తుల కోసం ఏర్పాట్లు చేశామని ప్రెసిబేటరీ ఇన్‌ఛార్జి శాంతయ్య, చర్చి కమిటీ కోశాధికారి గంట సంపత్ తెలిపారు. - న్యూస్‌టుడే, మెదక్ అర్బన్


డ్రోన్‌తో గాలించినా దొరకని షాకీర్ ఆచూకీ



గాలింపు చర్యలను పరిశీలిస్తున్న పోలీసు అధికారులు

జహీరాబాద్ అర్బన్, న్యూస్‌టుడే: జహీరాబాద్ మండలం బూచినెల్లి వద్ద నారింజ వాగులో గల్లంతైన షాకీర్ కోసం పోలీసు, రెవెన్యూ శాఖ అధికారులు గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి, సీఐ శివలింగం, తహసీల్దార్ రవీందర్ పర్యవేక్షణలో గురువారం తెలంగాణ-కర్ణాటక సరిహద్దులోని వాగు పరీవాహకం పొడువునా డ్రోన్ సాయంతో గాలింపు చేపట్టినా ఆచూకీ లభ్యం కాలేదు. నారింజ ప్రాజెక్టుతో పాటు కర్ణాటకలోని బరూర్, హుక్రానా, కంటానా శివార్లలో కురిసిన కుండపోత వర్షాలకు వాగులో వరద తగ్గుముఖం పట్టడం లేదు. గ్రామస్థుల సాయంతో గజ ఈతగాళ్లతో పాటు యువకుల సాయంతో వెతికినా ఫలితం లేకపోయింది. గాలింపు చర్యల్లో సమస్యలపై అధికారులు జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లడంతో శుక్రవారం ఎన్‌డీఆర్ఎఫ్ బృందాన్ని రప్పించేందుకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. వాగు ఉద్ధృతంగా పారడంతో జహీరాబాద్-ఘనపూర్ మార్గాన్ని పూర్తిగా మూసివేశారు. రాకపోకలు నిలిపివేశారు.

అనుమానాస్పద స్థితిలో ఒకరి మృతి



నిజామొద్దీన్

పరిగి గ్రామీణ, న్యూస్‌టుడే: మూడు రోజులుగా కనిపించని ఓవ్యక్తి అనుమానాస్పద స్థితిలో చెరువులో శవమై కనిపించాడు. ఈ సంఘటన పరిగి మండల పరిధిలోని రాఘవాపూర్‌లో గురువారం జరిగింది. ఎస్సై సంతోష్‌కుమార్ తెలిపిన వివరాలు. మహ్మద్ నిజామొద్దీన్ (47) అవివాహితుడు. వ్యవసాయపనులు చేస్తూ... గ్రామంలో ఒంటరిగా ఉంటున్నాడు. మూడు రోజులుగా కన్పించలేదు. గురువారం స్థానికులు రాఘవాపూర్ చెరువు పరిసరాల్లోకి వెళ్లగా చెరువు ఒడ్డున అతడు వేసుకునే దుస్తులు, టవల్, చెప్పులు, ఇంటి తాళం చెవులు కనిపించడంతో ఆందోళనకు గురయ్యారు. చెరువులో దూరంగా శవంలా కనిపించడంతో అనుమానంతో కుటుంబ సభ్యులకు, పోలీసులకు సమాచారం అందించారు. ఏఎస్సై రమేష్, సిబ్బందితో కలిసి ఒడ్డుకు చేర్చారు. పోస్టుమార్టం నిమిత్తం పరిగి సామాజిక ఆసుపత్రికి తరలించారు. అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

విద్యుదాఘాతంతో యువకుడి దుర్మరణం



రాజు

దోమ, న్యూస్‌టుడే: విద్యుదాఘాతానికి గురై ఓ యువకుడు దుర్మరణం చెందిన ఘటన దోమ మండలం దిర్సంపల్లిలో చోటుచేసుకుంది. దిర్సంపల్లికి చెందిన బొల్లం రాజు(28) కుటుంబం పొలం దగ్గరే ఇల్లు నిర్మించుకొని నాలుగేళ్లుగా నివాసం ఉంటున్నారు. వ్యవసాయానికి సరఫరా చేస్తే నియంత్రిక (బుడ్డీ) నుంచి ఇంట్లోకి కరెంటు లాగారు. బుధవారం రాత్రి ఇంట్లోకి సరఫరా లేక చీకటి పడింది. దీంతో నియంత్రికలోని లివర్‌ను ఇనుపపైపుతో సరిచేసే ప్రయత్నం చేయబోయాడు. దీంతో విద్యుదాఘాతానికి గురై అక్కడే పడిపోయాడు. తండ్రి అంజిలయ్య, భార్య స్వప్న గుర్తించి సీపీఆర్ విధానంలో కాపాడే ప్రయత్నం చేశారు. అదే రోజు రాత్రి కారులో వికారాబాద్ మిషన్ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు మృతి చెందినట్లు ధ్రువీకరించారు. ఒక్కగానొక్క కుమారుడు మృతి చెందడంతో తల్లిదండ్రులతో పాటు భార్య కన్నీరుమున్నీరుగా విలపించారు.

చికెన్ ధరలు			
ఫాంరేటు	125–00	డ్రెస్డ్	213–00
రిటైల్	147–00	స్కిన్‌లెస్	243–00

చిన్నారిని లాలించి.. ఆప్యాయత చాటి..



చిన్నారిని లాలిస్తున్న మంత్రి కొండా సురేఖ

మెదక్, న్యూస్‌టుడే: రాష్ట్ర మంత్రి కొండా సురేఖ ఓ చిన్నారిని లాలించి తన ఆప్యాయతను చాటారు. జిల్లా కేంద్రం మెదక్‌లో ఆరు గ్యారంటీల అమలుపై జరిగిన సమీక్షలో పాల్గొనేందుకు కలెక్టరేట్‌లోకి వెళ్తుండగా ఆరుబయట ఓ సీనియర్ మహిళా కానిస్టేబుల్ చేతిలో పసిబిడ్డను చూసి వెంటనే కాన్వాయ్ ఆపారు. ఆమె వద్దకు వెళ్లి ఎండగా ఉండటంతో చిన్నారికి నీటిని తాగించి వివరాలు ఆరా తీశారు. బాబు తల్లి సైతం తనతో పాటు విధులు నిర్వర్తిస్తున్నారని కానిస్టేబుల్ చెప్పింది. దీంతో బాబు తల్లి.. కానిస్టేబుల్ శ్రీలతను పిలిపించి మాట్లాడారు. వారిద్దరినీ తనతో పాటు కాన్వాయ్‌లో కలెక్టరేట్‌లోకి తీసుకెళ్లారు. పోలీసు ఉన్నతాధికారులతో మాట్లాడి ఆ మహిళా కానిస్టేబుల్ పరిస్థితిని వివరించి మరోచోట డ్యూటీ వేయాలని ఆదేశించారు.

● చాకలి ఐలమ్మ జయంతిని పురస్కరించుకొని ఆమె పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాటం చేసిన వీరనారి చాకలి ఐలమ్మ అని, ఆ స్ఫూర్తిని భవిష్యత్తు తరాలకు అందించాలనే సంకల్పంతో హైదరాబాద్ కోఠిలోని మహిళా యూనివర్సిటీకి ఆమె పేరు పెట్టామని తెలిపారు. కలెక్టరేట్‌లో మొక్క నాటి నీళ్లు పోశారు. వనమహోత్సవంలో నాటిన ప్రతి మొక్కను సంరక్షించాలని ఈ సందర్భంగా మంత్రి సూచించారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీ రఘునందన్ రావు, ఎమ్మెల్యేలు మైనంపల్లి రోహిత్ రావు, సునీతాలక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీలు సుభాష్‌రెడ్డి, యాదవరెడ్డి, కలెక్టర్ రాహుల్ రాజ్, అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఎల్ఈడీ దీపాల తయారీపై శిక్షణ



తయారీపై శిక్షణ పొందుతున్న విద్యార్థులు

సిద్దిపేట, న్యూస్‌టుడే: జిల్లా ఎన్‌జీసీ (నేషనల్ గ్రీన్ కోర్) విభాగం ఆధ్వర్యంలో సిద్దిపేటలోని ఇందిరానగర్ జడ్పీ ఉన్నత పాఠశాలలో ఎల్ఈడీ దీపాల తయారీపై గురువారం కార్యశాల నిర్వహించారు. 50 పాఠశాలలకు చెందిన 150 మంది విద్యార్థులు, ఉపాధ్యాయులకు తయారీ విధానంపై నేర్పించారు. ఎన్‌జీసీ జిల్లా సమన్వయకర్త భాస్కర్ నేతృత్వంలో కార్యక్రమం నిర్వహించగా.. హైదరాబాద్ నుంచి ప్రోగ్రాం అధికారి రాజశేఖర్ హాజరై శిక్షణ అందించారు. అనంతరం విద్యార్థులు, ఉపాధ్యాయులకు ధ్రువపత్రాలు ప్రదానం చేశారు.

రాత్రి చదువు.. ఇంటికి వెలుగు



పంచగామలో రాత్రి చదువుకుంటున్న విద్యార్థినులు

ఆసక్తి ఉండాలే కానీ ఏ సమయంలోనైనా చదువుకోవచ్చు. సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ ప్రాంతంలో ఈ విధానాన్ని అనుసరిస్తున్నారు. రాత్రి వేళ చదువు మరింత విస్తరిస్తోంది. మండలంలోని ర్యాకల్ జడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుల సూచనలతో సమయం వృథా చేయకుండా ఈ దిశగా అడుగేయడం గమనార్హం. ఇక్కడి తెలుగు ఉపాధ్యాయుడు చంద్రశేఖర్ దీనికి బీజం పోశారు. ర్యాకల్, పోతన్‌పల్లి గ్రామాల్లో 8, 9, 10వ తరగతి విద్యార్థులు 157 మంది నిత్యం రాత్రి 7 నుంచి 9 గంటల వరకు ఇలా చదివి సత్ఫలితాలు సాధించారు.

స్ఫూర్తి అందిపుచ్చుకొని..

చంద్రశేఖర్ ఇటీవలి ఉపాధ్యాయ బదిలీల్లో భాగంగా ఖేడ్ జడ్పీ ఉన్నత పాఠశాలకు వచ్చారు. తోటి ఉపాధ్యాయుల సహకారంతో ఇక్కడ సైతం రాత్రి చదువు అమలుకు శ్రీకారం చుట్టారు. ఇక్కడ ఖేడ్ పురపాలికతో పాటు సమీప 45 గ్రామాలకు చెందిన 900 మంది విద్యనభ్యసిస్తున్నారు. ఉపాధ్యాయుల చొరవతో మూడు నెలలుగా 8 గ్రామాల్లో రాత్రి చదువు కొనసాగుతోంది. మరోవైపు ఈ స్ఫూర్తిని అందిపుచ్చుకొని ఖేడ్ మండలం రుద్రారం, కంగ్టి మండలం తర్కవడగామ ప్రాథమికోన్నత పాఠశాలల విద్యార్థులు సైతం దీన్ని పాటిస్తుండటం విశేషం. మరిన్ని చోట్ల రాత్రి చదువుకు ఉపాధ్యాయులు.. విద్యార్థులతో పాటు తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నారు.

దాతల సహకారం

విద్యార్థులు రాత్రి సమయం వృథా చేయకుండా చదువుపై దృష్టి పెట్టడంతో పలువురు దాతలు తమ సహకారం అందించేందుకు ముందుకొస్తున్నారు. గతేడాది ర్యాకల్ ఉన్నత పాఠశాలలో 157 మందికి శాంతా డెవలపర్స్ యజమాని దుప్పట్లు అందజేశారు. పిల్లలకు ఉపయోగపడేలా నిత్యం పాఠశాల ప్రారంభానికి ముందు గంటపాటు స్పోకెన్ ఇంగ్లిష్ తరగతి నిర్వహించారు. బంజారాసేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రమేష్‌చౌహాన్ పది విద్యార్థులకు రోజూ సాయంత్రం అల్పాహారం అందించారు. ఖేడ్ మండలం పీర్లతండాకు చెందిన ఐఆర్ఎస్ అధికారి సుధాకర్‌నాయక్ పాఠశాలలో గ్రంథాలయంతో పాటు స్టడీ సెంటర్ ఏర్పాటు చేయించారు.

- న్యూస్‌టుడే, నారాయణఖేడ్

పదేళ్లుగా పరాయివాళ్లం: కోదండరాం



ఎమ్మెల్సీ కోదండరాంను సన్మానిస్తున్న ప్రతినిధులు

సిద్దిపేట టౌన్, న్యూస్‌టుడే: పదేళ్ల భారాస పాలనలో మనమంతా సొంత రాష్ట్రంలోనే పరాయివాళ్లుగా మిగిలిపోయామని ఎమ్మెల్సీ కోదండరాం ఆవేదన వ్యక్తం చేశారు. ఇన్నాళ్లు ఒక్కరి చేతిలోనే పాలన సాగడం దురదృష్టకరమన్నారు. సిద్దిపేటలోని ఎన్జీవోస్ భవన్‌లో తెలంగాణ ఉద్యమకారుల వేదిక జిల్లా శాఖ ఆధ్వర్యంలో గురువారం ఆత్మీయ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యమకారులు ఆయన్ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో ఉద్యమకారుల సమస్యలకు పరిష్కారం దొరకలేదని, వాటిపై చర్చకు వేదిక అవసరమని, విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానన్నారు. తెలంగాణలో నానాటికీ నిరుద్యోగ సమస్య పెరిగిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. భవిష్యత్ తెలంగాణ నిర్మాణం కోసం చిత్తశుద్ధితో పనిచేద్దామని ఉద్ఘాటించారు. అనంతరం తమ ఉద్యోగాలను కొనసాగించాలని కోరుతూ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ప్రతినిధులు వినతిపత్రం అందజేశారు. ఉద్యోగభద్రత కోసం జూనియర్ కళాశాలల అతిథి అధ్యాపకులు, ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలని డిగ్రీ కళాశాలల ఒప్పంద అధ్యాపకులు వినతిపత్రాలు అందజేశారు. వేదిక ప్రతినిధులు పరమేశ్వర్, పెద్దిరాజు, అందె ప్రవీణ్, విక్రమ్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, కనకచంద్రం, కొండి మల్లారెడ్డి, అయిత అంజయ్య, బాపురావు తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు అనారోగ్యంతో బాధపడుతున్న ఉమ్మడి మెదక్ జిల్లా ఐకాస మాజీ ఛైర్మన్ డా.పాపయ్యను పరామర్శించారు.

అవయవదానంతో మరొకరికి పునర్జన్మ



డా.రవి సుందర్‌ను సన్మానిస్తున్న ఉస్మానియా వైద్యులు

హైదరాబాద్, న్యూస్‌టుడే: అవయవదానంతో ఇతరులకు పునర్జన్మ ప్రసాదించవచ్చని ఉస్మానియా వైద్యకళాశాల ప్రిన్సిపల్ డా.నరేందర్‌కుమార్ అన్నారు. అవయవదానంపై ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. జీవన్మృతుడు నుంచి సేకరించిన అవయవాల ద్వారా ఇద్దరికి కాలేయ మార్పిడి శస్త్ర చికిత్స విజయవంతంగా పూర్తి చేయడం అభినందనీయమన్నారు. గురువారం ఆసుపత్రిలో పర్యవేక్షకుడు డా.రాకేశ్ సహాయ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ప్రిన్సిపల్ మాట్లాడారు. ఉస్మానియా వైద్యుల అభ్యర్థన మేరకు అవయవదానంపై రోగుల సహాయకులకు అవగాహన కల్పించేందుకు ట్రాన్స్‌ప్లాంట్ కో-ఆర్డినేటర్ ఏర్పాటు విషయమై ప్రభుత్వానికి విన్నవిస్తామన్నారు. ఆసుపత్రి సర్జికల్ గ్యాస్ట్రో ఎంటరాలజీ విభాగాధిపతి డా. సీహెచ్.మధుసూదన్, డా.మనీషా సహాయ్ (నెఫ్రాలజీ), డా.ఎన్.నాగప్రసాద్ (ప్లాస్టిక్ సర్జరీ), డా.మల్లికార్జున్ (యూరాలజీ), డా.చంద్రశేఖర్(అనస్థీషియా) తదితరులు మాట్లాడారు. ఇద్దరికి కాలేయ మార్పిడి, నలుగురికి మూత్రపిండాల మార్పిడి, నలుగురికి కార్నియా మార్పిడి, కాలిన గాయాలకు గురైన వారికి అతికించేందుకు చర్మం అతికించేందుకు అవయవాలు సేకరించినట్లు వెల్లడించారు. సిద్దిపేట జిల్లా మద్దూరు మండలం వల్లంపట్ల గ్రామానికి చెందిన నరేందర్(46)కు ఈ నెల 18న కాలేయ మార్పిడి శస్త్ర చికిత్సను విజయవంతంగా పూర్తి చేసినట్లు వెల్లడించారు.

వీరనారి ఐలమ్మ సేవలు స్ఫూర్తిదాయకం



చాకలి ఐలమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వీసీ నీరజ ప్రభాకర్, అధికారులు

ములుగు, న్యూస్‌టుడే: వీరనారి చాకలి ఐలమ్మ జయంతి వేడుకలను గురువారం ములుగు, మర్కూక్ మండలాల్లో ఘనంగా నిర్వహించారు. ములుగు ఉద్యాన విశ్వవిద్యాలయంలో జరిగిన కార్యక్రమంలో చాకలి ఐలమ్మ చిత్రపటానికి వీసీ నీరజ ప్రభాకర్ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ.. ఐలమ్మ పోరాటం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. మండల పరిధిలోని మామిడ్యాల కాలనీలో జరిగిన కార్యక్రమంలో ఐలమ్మ చిత్రపటానికి రజక సంఘం మండలాధ్యక్షుడు రాజు, ఏఎంసీ మాజీ వైస్ ఛైర్మన్ భూపాల్ రెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

విద్యార్థుల క్షేత్రస్థాయి పర్యటన



అవగాహన కల్పిస్తున్న అధికారులు

నర్సాపూర్ రూరల్, న్యూస్‌టుడే: విద్యార్థులను తరచూ క్షేత్రస్థాయి పర్యటనలకు తీసుకెళ్లడంతో నైపుణ్యం పెరుగుతుందని పెద్దచింతకుంట ప్రభుత్వ డిగ్రీ కళాశాల జంతుశాస్త్ర అధ్యాపకుడు డా.సురేశ్‌కుమార్ అన్నారు. కళాశాలలో బీఎస్సీ విద్యార్థులను హైదరాబాద్‌లోని సీసీఎంబీ, ఎన్‌జీఆర్ఐ, సీఎస్ఐఆర్ కార్యాలయాలకు క్షేత్రస్థాయి పర్యటనలకు తీసుకెళ్లారు. విద్యార్థుల సందేహాలను అధికారులు నివృత్తి చేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు డా.సౌజన్య, రుక్మిణి, రమేశ్, ఆరిఫ్ ఉన్నారు.

సేవలోనే నిజమైన సంతృప్తి



సరకులు అందుకున్న పేదలతో డీఎస్పీ, గ్రోస్ సంస్థ కార్యదర్శి తదితరులు

మెదక్ అర్బన్: పేద ప్రజలకు సేవ చేయడంలోనే నిజమైన సంతృప్తి ఉంటుందని డీఎస్పీ ప్రసన్నకుమార్ అన్నారు. గురువారం పట్టణంలో గ్రోస్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో కార్యదర్శి జాయ్ ముర్రే అధ్యక్షతన 32 మంది పేద కుటుంబాలకు డీఎస్పీ చేతుల మీదుగా నిత్యావసర సరకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో చర్చి కార్యదర్శి శాంసన్ సందీప్, సభ్యులు పాలిన్, జోయల్ సామ్, శ్రేష్ఠ, చెర్రీ, ఫెర్రీ, మెర్రీ, లవీ, ఆనంద్‌సింగ్ పాల్గొన్నారు.

నగర కార్యదర్శిగా అనిల్‌కుమార్



ఎన్నికైన సభ్యులతో అభావిప నాయకులు

మెదక్ టౌన్, న్యూస్‌టుడే: అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ పట్టణ కార్యదర్శిగా అనిల్‌కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గురువారం పట్టణంలోని సంఘం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మెదక్, సిద్దిపేట జిల్లాల సంఘటన మంత్రి లక్ష్మీపతి పాల్గొని ఎన్నికల పరిశీలకులుగా వ్యవహరించారు. మెదక్ పట్టణ సంయుక్త కార్యదర్శులుగా కార్తికేయ, భరత్, నందకిశోర్, ఎస్ఎఫ్‌డీ కన్వీనర్లుగా నీరజ్, చంద్రిక, సోషల్ మీడియా కన్వీనర్‌గా శశాంక్, కళామంచ్ కన్వీనర్‌గా పావని, మహిళా కన్వీనర్‌గా పూజిత ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సమావేశంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ప్రశాంత్, అభావిప నాయకులు పాల్గొన్నారు.

అలరించిన కళోత్సవ్

చిన్నశంకరంపేట, న్యూస్‌టుడే: విద్యార్థులు చదువుతోపాటు అన్ని రంగాల్లో రాణించాలని చిన్నశంకరంపేట జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు దీప్లా తెలిపారు. గురువారం పాఠశాలలో కళోత్సవంలో భాగంగా విద్యార్థులకు ఆటలు, పాటల పోటీలు నిర్వహించారు. గ్రూప్ ఫోక్ డ్యాన్స్‌లో చిన్నశంకరంపేట జడ్పీ ఉన్నత పాఠశాల, సింగిల్ ఫోక్ డ్యాన్స్‌లో కేజీబీవీ, సోలో క్లాసిక్ డ్యాన్స్‌లో జడ్పీహెచ్ఎస్ మిర్జాపల్లి, కథల పోటీలో జడ్పీహెచ్ఎస్ చందంపేట, సోలో, గ్రూప్ పాటల పోటీల్లో చిన్నశంకరంపేట ఆదర్శ పాఠశాల విద్యార్థులు విజేతలుగా నిలిచారు.

వంట.. తంటా

మధ్యాహ్న భోజనం వండేందుకు గదులు కరవు

న్యూస్‌టుడే, టేక్మాల్

ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం వండేందుకు సరైన వసతుల్లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. చాలా బడుల్లో వంట గదులు లేకపోవడంతో ఆరుబయట వండుతున్నారు. వర్షాకాలంలో వానలకు, వేసవి ఎండలకు భోజన నిర్వాహకులు అవస్థలు పడుతున్నారు.



మెరుగోనికుంట తండాలో ఆరుబయట మధ్యాహ్న భోజనం చేస్తున్న విద్యార్థులు

మండలంలో 53 పాఠశాలలు..

మండలంలో 53 పాఠశాలల్లో 3,453 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. 19 పాఠశాలలకు అక్షయ పాత్ర ద్వారా మధ్యాహ్న భోజనం అందుతోంది. మరో 10 పాఠశాలలకు వంట గదుల్లేవు. మిగతా వాటికి ఉన్నాయి. మండల పరిధిలోని చల్లపల్లి ప్రాథమిక పాఠశాలలో మూడు గదులున్నాయి. శిథిలావస్థకు చేరిన రెండు గదులను గతేడాది కూల్చేశారు. ఒక గదితోపాటు వరండాలో చదువులు కొనసాగుతున్నాయి. ఆరుబయట వంటలు చేస్తున్నారు. మండల కేంద్రంలోని హరిజనవాడ ప్రాథమిక పాఠశాలలో ఒక గదిలోనే తరగతులు కొనసాగుతున్నాయి. వంట గది లేకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. ప్రస్తుతం పాఠశాలలో 9 మంది విద్యార్థులున్నారు. వారిని ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న మధ్యాహ్న భోజనానికి తీసుకెళుతున్నారు. చెరువుముందరి తండాలో వంటశాల లేకపోవడంతో ఆరుబయట వంటలు వండుతున్నారు. గడ్డమీదిపల్లి ప్రాథమిక పాఠశాలలో గది లేకపోవడంతో పాఠశాలకు కొద్ది దూరంలోని వెంకటింట్లో భోజనాలు వండుతున్నారు. సాలోజిపల్లి ప్రాథమిక పాఠశాలలో తరగతి గదిలోనే వంటలు చేస్తున్నారు. తరగతి గదిలో భోజనాలు వండుతుండడంతో విద్యార్థులకు అసౌకర్యంగా మారింది. దండువానికుంట పాఠశాలలో వంట గది లేకపోవడంతో పాఠశాలలోని వరండాలో వంటలు చేస్తున్నారు. మెరుగోనికుంట పాఠశాలను మన ఊరు-మన బడి కార్యక్రమంలో గత ప్రభుత్వం ఎంపిక చేసింది. అన్ని వసతులను ఏర్పాటు చేసింది. పాఠశాలకు సంబంధించిన స్థల వివాదం ఉండడంతో వంట గదిని నిర్మించ లేదు. ముత్యాలబందం తండా, దండువానికుంట తండాల్లో మధ్యాహ్న భోజన నిర్వాహకులకు ఇబ్బందులు తప్పడం లేదు. కాదులూర్ తండాలో పక్కనున్న అంగన్‌వాడీ కేంద్రం వద్ద వంటలు చేస్తున్నారు. పాఠశాలకు నీటి వసతి లేకపోవడంతో కష్టాలు తప్పడం లేదు. పైపులైన్, ట్యాంకు పాడవడంతో అవస్థలు తప్పడం లేదు. హరిజనవాడలో నీటి సౌకర్యం లేక విద్యార్థులు ఇంటి నుంచి తీసుకెళుతున్నారు.

ఉన్నతాధికారులకు వివరించాం..

– సుజాత, ఎంఈవో

వంట గదుల్లేని పాఠశాలల వివరాలను ఉన్నతాధికారులకు విన్నవించాం. నిధులు మంజూరు వంట గదులు నిర్మించేలా చర్యలు తీసుకుంటాం. నిర్వాహకుల సమస్యలు పరిష్కరిస్తాం.

డంపింగ్ యార్డు నిర్మాణం ఆపాలని తీర్మానం



మాట్లాడుతున్న పుర అధ్యక్షుడు అశోక్‌గౌడ్

నర్సాపూర్, న్యూస్‌టుడే: సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండలం ప్యారానగర్ అటవీ ప్రాంతంలో డంపింగ్‌యార్డు ఏర్పాటు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని పురపాలిక సాధారణ సమావేశంలో ఏకగ్రీవంగా తీర్మానించారు. పుర పాలిక సాధారణ సమావేశం పుర అధ్యక్షుడు అశోక్‌గౌడ్ అధ్యక్షతన గురువారం జరిగింది. ఈ సందర్భంగా కౌన్సిలర్లు రుక్కమ్మ, సునీత, లక్ష్మి, సరిత, లలిత మాట్లాడుతూ.. ప్యారానగర్ అటవీ ప్రాంతంలో జీహెచ్ఎంసీకి చెందిన డంపింగ్‌యార్డు ఏర్పాటు చేస్తే వర్షం కురిసినప్పుడు కలుషిత నీరంతా అడవుల్లోని చెక్ డ్యాంల మీదుగా రాయరావు చెరువులోకి చేరే ప్రమాదముందన్నారు. వన్యప్రాణులకు ముప్పు వాటిల్లనుందన్నారు. స్పందించిన పుర అధ్యక్షుడు డంపింగ్ యార్డు రద్దు తీర్మానాన్ని కలెక్టర్‌కు పంపనున్నట్లు తెలిపారు. పట్టణంలో గొర్రెలు, మేకల సంత నిర్వహణకు నిర్ణయించారు. కౌన్సిలర్ ఇస్రత్ ఫాతిమా మాట్లాడుతూ.. దోమల నివారణకు ఫాగింగ్ చేయించాలన్నారు. చెల్మటి లక్ష్మి మాట్లాడుతూ.. సంతలోకి వాహనాలను అనుమతించరాదని కోరారు. నీటి సమస్య పరిష్కారానికి కొత్తగా తవ్వించిన బోర్లలో మోటార్లను అమర్చి వినియోగంలోకి తీసుకురావాలని సరిత కోరారు. కమిషనర్ రామకృష్ణారావు, మేనేజర్ మధుసూదన్, డీఈ రాధికాలక్ష్మి పాల్గొన్నారు.

తపాలాశాఖ సేవలపై అవగాహన



లబ్ధిదారులకు బీమా చెక్కులు అందిస్తున్న తపాలాశాఖ సూపరింటెండెంట్ శ్రీహరి

దౌల్తాబాద్: తపాలా శాఖ సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని తపాలా శాఖ సూపరింటెండెంట్ శ్రీహరి అన్నారు. గురువారం మండల పరిధిలోని దొమ్మాటలో జీవిత బీమా, ఇతర బీమా పాలసీలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేవలం రోజుకు రూ.2లు చెల్లించి రూ.15 లక్షల ప్రమాద బీమా పొందవచ్చన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో తపాలా శాఖ ద్వారా అందిస్తున్న బీమా పాలసీలపై ప్రజలకు అవగాహన కల్పించాలని స్థానిక పోస్టుమాస్టర్లకు సూచించారు. మిరుదొడ్డి మండలం అల్వాలకు చెందిన పుల్ల పరశురాములు ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. దీంతో అతని భార్య లావణ్యకు రూ.30 లక్షల బీమా చెక్కును అందించారు. మెదక్ సబ్ డివిజనల్ ఇన్‌స్పెక్టర్ కుల్కర్ణి సందీప్, బ్రాంచ్ మేనేజర్ శ్రీనివాస్, ఏరియా మేనేజర్ అర్జున్, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారమే ధ్యేయం

మెదక్ రూరల్, న్యూస్‌టుడే: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారమే పీఆర్టీయూ ధ్యేయమని సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సుంకరి కృష్ణ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని సంఘం కార్యాలయంలో మెదక్ పట్టణ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జీవో 25ను వెంటనే సవరించాలని డిమాండ్ చేశారు. అధ్యక్షుడిగా వీరేశం, ప్రధాన కార్యదర్శిగా గంగారాం, అసోసియేట్ అధ్యక్షుడిగా నర్సింలు, కార్యవర్గ సభ్యులుగా రజిని, పంతులు కృష్ణ ఎన్నికయ్యారు.

పీఆర్టీయూ నూతన కార్యవర్గం ఎన్నిక

అల్లాదుర్గం: పీఆర్టీయూ ఉపాధ్యాయ సంఘం నూతన మండల కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి కృష్ణ గురువారం తెలిపారు. మండల అధ్యక్షుడిగా జనార్దన్, ప్రధాన కార్యదర్శిగా రంజ్యానాయక్, అసోసియేట్ అధ్యక్షుడు నాగరాజు, మహిళా కార్యదర్శిగా సవిత, కార్యదర్శిగా అలీమొద్దీన్‌ను ఎన్నుకొన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సంఘం నాయకులు నర్సింహులు, కిష్టయ్య, సత్యనారాయణ, నాగభూషణం, రాజు పాల్గొన్నారు.

విద్యతోపాటు నైపుణ్యాలపై దృష్టి



జ్యోతి వెలిగిస్తున్న అధ్యాపకులు

మెదక్ టౌన్: విద్యతోపాటు ఇతర నైపుణ్యాలపై దృష్టి సారించాలని మెదక్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ గణపతి విద్యార్థులకు సూచించారు. గురువారం కళాశాల ఆర్ట్స్ క్యాంపస్‌లో నిర్వహించిన స్వాగత కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విద్యార్థి దశ చాలా కీలకమైందని, ఉన్నత లక్ష్యాలను ఎంచుకొని ఆ దిశగా రాణించేందుకు కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అంతకుముందు ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ గణపతితో కలిసి అధ్యాపకులు జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అధ్యాపకులు రాజాగౌడ్, వెంకటేశ్వర్లు, సురేందర్, రవీందర్, నాగరాజు పాల్గొన్నారు.

ఉద్యోగులను సస్పెండ్ చేయడం సరికాదు



ఎంపీడీవో కార్యాలయం వద్ద నినాదాలు చేస్తున్న సిబ్బంది, కార్యదర్శులు

అల్లాదుర్గం, న్యూస్‌టుడే: నల్గొండ జిల్లాలో ఎంపీడీవో, పంచాయతీ కార్యదర్శులను కలెక్టర్ సస్పెండ్ చేయడం సరికాదని అల్లాదుర్గం ఎంపీడీవో చంద్రశేఖర్ అన్నారు. గురువారం ఎంపీడీవో కార్యాలయం ఎదుట పంచాయతీ కార్యదర్శులు, సిబ్బందితో కలిసి నల్లబాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. కార్యక్రమంలో కార్యాలయ పర్యవేక్షకుడు శంకర్, పంచాయతీ కార్యదర్శులు లింగప్ప, ప్రభాకర్, ఉదయ్, ఖయ్యూం, అనిత, తుకారం, సజ్జత్ అలీ పాల్గొన్నారు.

వైకుంఠ రథానికి రూ.1.65 లక్షల వితరణ



చెక్కు అందిస్తున్న రాజేందర్‌రెడ్డి

చిలప్‌చెడ్: వైకుంఠ రథం ఏర్పాటుకు సాయం చేయడం హర్షణీయమని మండల పరిధి శీలాంపల్లి గ్రామస్థులు అన్నారు. గ్రామానికి చెందిన ఎల్లయ్యగారి రాజేందర్‌రెడ్డి రూ.1.65 లక్షల చెక్కును గురువారం గ్రామస్థులకు అందించారు. కార్యక్రమంలో ముకుందరెడ్డి, భగవంత్‌రెడ్డి, నవీన్‌రెడ్డి, సాయిరెడ్డి, మహిపాల్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, మాధవరెడ్డి, గోపాల్‌రెడ్డి, నవాజ్, శేఖర్, ప్రభు ఉన్నారు.

'రాజకీయ లబ్ధికే భారాస డ్రామా'

శివ్వంపేట, న్యూస్‌టుడే: మండల పరిధి గోమారంలో ఎమ్మెల్యే సునీతారెడ్డి ఇంటిపై కాంగ్రెస్ దాడికి పాల్పడినట్లు భారాస తప్పుడు ప్రచారం చేయడం రాజకీయ లబ్ధికేనని శివ్వంపేట సహకార సంఘం ఛైర్మన్ చింతల వెంకట్రాంరెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నేతలు పెద్దపట్లోరి మాధవరెడ్డి, పులిమామిడి నవీన్‌గుప్తా అన్నారు. గోమారంలో గురువారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సుధీర్‌రెడ్డి, సహకార సంఘం వైస్ ఛైర్మన్ వేణుగోపాల్‌రెడ్డి, అంజిరెడ్డి, సురేందర్‌రెడ్డి, పుట్ట మహేందర్ ఉన్నారు.

బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం

హవేలిఘనపూర్: మండల పరిధి రాజ్‌పేటకు చెందిన పారిశుద్ధ్య కార్మికుడు దాసరి పోచయ్య 15 రోజుల కిందట, కాప్రాయిపల్లికి చెందిన కుక్కల రాజు(28) బుధవారం విద్యుదాఘాతంతో చనిపోయారు. మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి బాధిత కుటుంబాలకు రూ.5వేల చొప్పున భారాస నాయకుల ద్వారా సాయం అందించారు. కార్యక్రమంలో సాయాగౌడ్, కిషన్, బాబాగౌడ్ ఉన్నారు.

ఎల్వోసీ అందజేత

పెద్దశంకరంపేట, న్యూస్‌టుడే: మండలంలోని మక్తలక్ష్మాపురానికి చెందిన వేల్పుగొండ సుశీలకు ఎమ్మెల్యే సంజీవరెడ్డి రూ.75 వేల ఎల్వోసీ అందించారు. ఖేడ్‌లోని ఆయన నివాసం వద్ద బాధిత కుటుంబానికి ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్, వేల్పుగొండ నర్సింలు ఉన్నారు.

పండ్ల తోటల పెంపకానికి ప్రాధాన్యం

చిన్నశంకరంపేట: రైతులు పండ్ల తోటల పెంపకానికి ముందుకు రావాలని ఏపీవో రాజ్‌కుమార్ సూచించారు. గురువారం మండల పరిధి అంబాజీపేటలో తోటను పరిశీలించారు. ప్రభుత్వం అందించే రాయితీని పొందాలని, ఒక్కసారి పంట వేస్తే ఏడాదిపాటు ఆదాయం వస్తుందన్నారు. ఆయన వెంట టీఏ సంపత్, ప్రసాద్ తదితరులు ఉన్నారు.

ఆర్థిక బలోపేతానికి రుణాలు: అదనపు డీఆర్డీవో

మనోహరాబాద్: మహిళలు ఆర్థికంగా బలపడేందుకు స్త్రీనిధి ద్వారా రుణాలు మంజూరు చేస్తున్నామని అదనపు డీఆర్డీవో సరస్వతి అన్నారు. మండల ఐకేపీ ఏపీఎం పెంటాగౌడ్ ఆధ్వర్యంలో గురువారం ఏర్పాటు చేసిన వీవోఏల సమావేశంలో ఆమె పాల్గొన్నారు. రుణ చెల్లింపులు, వసూలు లెక్కలను వీవోఏలు సక్రమంగా నిర్వహించాలని సూచించారు. సీసీలు, వీవోఏలు, మహిళా సమాఖ్య అధ్యక్షులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బూట్లు, సాక్సుల వితరణ

చిన్నశంకరంపేట: ప్రభుత్వ బడుల్లో నాణ్యమైన విద్య అందించడానికి ప్రతి ఉపాధ్యాయుడు కష్టపడి పనిచేస్తున్నారని దరిపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ఎం శ్రీనివాస్‌రావు అన్నారు. గురువారం శ్రీకర్‌రెడ్డి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు బూట్లు, సాక్సులు అందించారు.



పెద్దశంకరంపేటలో రజక సంఘ సభ్యులు..



నర్సాపూర్‌లో నివాళులు అర్పిస్తున్న ఆంజనేయులుగౌడ్, రాజిరెడ్డి



రామాయంపేటలో..

ఐలమ్మ సేవలు చిరస్మరణీయం

జిల్లావ్యాప్తంగా గురువారం చాకలి ఐలమ్మ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆమె విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. భూస్వాములకు వ్యతిరేకంగా చేసిన పోరాటాలను పలువురు వక్తలు వివరించారు. కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

– న్యూస్‌టుడే బృందం

పనులు తొందరగా పూర్తి చేయండి



వివరాలు తెలుసుకుంటున్న శ్రీనివాస్‌రావు

నర్సాపూర్ రూరల్, న్యూస్‌టుడే: ప్రభుత్వ పాఠశాలల్లో మిగిలిపోయిన పనులను తొందరగా పూర్తి చేయాలని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి, మండల ప్రత్యేకాధికారి శ్రీనివాస్‌రావు అన్నారు. మండలంలోని రెడ్డిపల్లి, ఖాజీపేట ఉన్నత, మంతూరు ప్రాథమికోన్నత పాఠశాలలను పరిశీలించారు. బడుల్లో కొన్ని మిగిలిన పనులను అమ్మ ఆదర్శ కమిటీ సభ్యులు పూర్తి చేయించాలన్నారు. పనులు పూర్తయిన వాటిని వినియోగంలోకి తీసుకురావాలన్నారు. ఉపాధ్యాయులను పలు విషయాలు అడిగి తెలుసుకున్నారు. ఏపీఎం గౌరీశంకర్, ఉపాధ్యాయులు ఉన్నారు.

పీఏసీఎస్ ఛైర్మన్‌పై దాడి

టేక్మాల్: మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఛైర్మన్ యశ్వంత్‌రెడ్డిపై డైరెక్టర్ అనుచరుడు దాడికి పాల్పడ్డాడు. టేక్మాల్ సొసైటీ సీఈవో ఇటీవల సస్పెండయ్యారు. బాధ్యతలను ఆపరేటర్ శివకృష్ణకు అప్పగించేందుకు ఉన్నతాధికారుల సూచనతో గురువారం సొసైటీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. సొసైటీ సహాయ రిజిస్ట్రార్ ఫయాజొద్దీన్ హాజరయ్యారు. సీఈవో ఇన్‌ఛార్జి బాధ్యతలు అప్పగించేందుకు తీర్మానం చేశారు. పాలకవర్గం సంతకాలు చేసింది. ఇతర తీర్మానాలు చేయాలని సభ్యులు కోరారు. ఈ విషయంలో ఓ డైరెక్టర్ ఛైర్మన్‌ను దూషించారు. దీంతో కొద్దిసేపు గొడవ జరిగింది. ఈ క్రమంలో ఛైర్మన్ సమావేశం నుంచి బయటకు వెళుతుండగా.. డైరెక్టర్ అనుచరుడు దాడికి పాల్పడడంతో రక్త గాయాలయ్యాయి. చికిత్సకు జోగిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. ఛైర్మన్ ఫిర్యాదుతో ఎస్సై రాజేశ్.. కేసు నమోదు చేశారు.

జీవో 25 రద్దు చేయండి

వెల్దుర్తి(మాసాయిపేట), చిన్నశంకరంపేట: జీవో 25ను వెంటనే రద్దు చేయాలని గురువారం మాసాయిపేట ఉన్నత పాఠశాల వద్ద ఉపాధ్యాయులు నిరసన తెలిపారు. రంగారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, మహబూబ్‌బాషా పాల్గొన్నారు.

రాజకీయ కక్షతోనే పీఏసీఎస్ ఛైర్మన్‌పై దాడి: క్రాంతికిరణ్



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే క్రాంతికిరణ్

జోగిపేట టౌన్: టేక్మాల్ పీఏసీఎస్ ఛైర్మన్ యశ్వంత్‌రెడ్డిపై రాజకీయ కక్షతోనే కాంగ్రెస్ నాయకులు దాడికి పాల్పడ్డారని అందోలు మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ ఆరోపించారు. గురువారం పట్టణంలో నివాసముంటున్న టేక్మాల్ పీఏసీఎస్ ఛైర్మన్ యశ్వంత్‌రెడ్డిని భారాస నాయకులతో కలిసి ఆయన పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితి, దాడి జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా క్రాంతికిరణ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ నాయకుల ఆగడాలు పెరిగాయన్నారు. బాధ్యులపై హత్యాయత్నం కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. టేక్మాల్ భారాస అధ్యక్షుడు వీరప్ప, నాయకులు సాయికుమార్, చాపల వెంకటేశం, రవి ఉన్నారు.

ఇరువర్గాలపై కేసు నమోదు

అల్లాదుర్గం: రెడ్డిపల్లికి చెందిన భారాస, కాంగ్రెస్ పార్టీ నాయకులపై గురువారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై ప్రవీణ్‌రెడ్డి తెలిపారు. గ్రామానికి చెందిన భారాస నాయకుడు రవీందర్‌రెడ్డి పెద్దశంకరంపేట్ నుంచి రెడ్డిపల్లికి ద్విచక్ర వాహనంపై వస్తుండగా.. మార్గమధ్యలో అల్లాదుర్గం శివారులో అదే గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు నర్సింహారెడ్డి, వెంకయ్య, మహేందర్‌రెడ్డి, సంగారెడ్డి, సాయిరెడ్డి అడ్డుకొని గొడవపడ్డారు. ఇరువర్గాల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

చీడపీడల నివారణకు సూచనలు

చిలప్‌చెడ్: పంటలకు రసాయన మందులను మోతాదుకు మించి పిచికారీ చేయరాదని ఏడీఏ పుణ్యవతి, ఏవో రాజశేఖర్ అన్నారు. గురువారం అంతారం శివారులో పంట పొలాలను సందర్శించారు. ఏఈవో భూపాల్ ఉన్నారు.

కేవీపీఎస్ నేతల పరామర్శ

మనోహరాబాద్: గౌతోజీగూడలో కుటుంబాన్ని సాంఘిక బహిష్కరణ చేసిన వారిని కఠినంగా శిక్షించాలని కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఉపాధ్యక్షులు స్కైలాబ్‌బాబు, మాణిక్యం అన్నారు. కేవీపీఎస్ ఆధ్వర్యంలో బాధితులను పరామర్శించారు. రాష్ట్ర కమిటీ సభ్యులు బాలకిషన్, కృష్ణమూర్తి, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, నాగరాజు ఉన్నారు.

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం

హవేలిఘనపూర్: పరిసరాల పరిశుభ్రతపైనే ఆరోగ్యం ఆధారపడి ఉంటుందని ఎంపీవో వెంకటేశ్వర్ అన్నారు. గురువారం స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమంలో భాగంగా హనుమాన్ మందిరం చుట్టూ ఉన్న పిచ్చిమొక్కలను తొలగించి పరిసరాలను శుభ్రం చేశారు. రాము, గణేశ్, ఆసిఫ్, భరత్ పాల్గొన్నారు.

మెదక్ టౌన్: తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ అధికారిణులు దీపిక, రమ్య ఆధ్వర్యంలో స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమం జరిగింది. ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు గురువారం పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయ పరిసర ప్రాంతాల్లోని పిచ్చి మొక్కలు, చెత్తాచెదారాన్ని తొలగించారు.

● పురపాలిక పరిధిలోని 5వ వార్డు ఇందిరాపురి కాలనీలో వార్డు కౌన్సిలర్ ఆంజనేయులు ఆధ్వర్యంలో పుర మేనేజర్ భవాని, వార్డు ఇన్‌ఛార్జి నాగరాజు పాల్గొన్నారు.

సమీకృతం.. నిర్వహణ అధ్వానం

శిథిలమవుతున్న దుకాణాలు



సమీకృత మార్కెట్‌లో ఖాళీగా దుకాణాలు

న్యూస్‌టుడే, తూప్రాన్: రూ.కోట్లతో నిర్మించిన సమీకృత మార్కెట్ భవనం నిర్వహణ అధ్వానంగా మారింది. పనులు నాసిరకంగా చేయడంతో బండలు ఊడిపోతున్నాయి. దాదాపు 70 దుకాణాలకుపైగా ప్రారంభించేందుకు అవకాశమున్నా పట్టించుకోవడం లేదు. సరైన గిరాకీ లేక ఉపయోగించడం లేదని పలువురు చెబుతున్నారు.

రూ.11 కోట్లతో నిర్మాణం..

వ్యాపార, వాణిజ్య అవసరాలకు రూ.11 కోట్లతో తూప్రాన్‌లో సమీకృత విపణి సముదాయం నిర్మించారు. అందులో కూరగాయలు, మాంసం, ఇతర దుకాణాలు ఏర్పాటు చేసుకోవచ్చు. 2022 సెప్టెంబరులో అప్పటి ప్రజాప్రతినిధులు భవనాన్ని ప్రారంభించారు. గ్రౌండ్ ఫ్లోర్‌లో రోడ్డువైపు 10 వాణిజ్య, లోపల కూరగాయల దుకాణాలు, మొదటి అంతస్తులో మాంసం దుకాణాలు, రెండో అంతస్తులో షాపింగ్‌మాల్స్ ఏర్పాటుకు అనుగుణంగా సముదాయం నిర్మించారు. భవనం ప్రారంభించినప్పుడు మొదటి అంతస్తులో మాంసం దుకాణాలు, రెండో అంతస్తులో షాపింగ్‌మాల్స్ ఏర్పాటు చేశారు. అధికాదాయం వచ్చే రోడ్డువైపు నిర్మించిన 10 దుకాణాలు ప్రారంభం నుంచీ ఖాళీగానే ఉంటున్నాయి. పట్టణానికి దూరంగా ఉండడంతో వ్యాపారులు ఆసక్తి చూపడం లేదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

అధ్వానంగా శౌచాలయాలు..

సమీకృత విపణిలో వాణిజ్య దుకాణాల ఏర్పాటుకు మార్కెటింగ్ శాఖ అధికారులు అన్ని వసతులతో నిర్మించారు. 70పైగా దుకాణాలు ఏర్పాటు చేయాల్సిన మార్కెట్లో ప్రస్తుతం కనీసం 10 కొనసాగడం లేదు. దీంతో పట్టించుకునే వారు లేక స్టాళ్లకు ఏర్పాటు చేసిన బండలు ఊడిపోతున్నాయి. శౌచాలయాల నిర్వాహణ పట్టించుకోకపోవడంతో దుర్వాసన వస్తోంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు పట్టించుకోవాలని, విలువైన భవనాన్ని ఇతర అవసరాలకైనా వినియోగించాలని స్థానికులు కోరుతున్నారు.

అధికారులు పట్టించుకుంటే మేలు..

– రాజు, తూప్రాన్

రూ.కోట్లతో నిర్మించిన సమీకృత మార్కెట్ భవనం నిర్వహణపై అధికారులు పట్టించుకుంటే బాగుంటుంది. పట్టణానికి దూరంగా ఉండటంతో ఇక్కడ దుకాణాలు ఏర్పాటు చేసేందుకు వ్యాపారులు ఆసక్తి చూపడం లేదు. ఈ విలువైన భవనాన్ని ఇతర ప్రభుత్వ కార్యాలయాలకు కేటాయిస్తే ఎంతో ప్రయోజనకరంగా ఉంటుంది.

మరమ్మతులు చేయిస్తాం..

– జాన్‌వెస్లీ, వ్యవసాయ మార్కెట్ ఇన్‌ఛార్జి కార్యదర్శి

మార్కెట్ భవనంలోని దుకాణాలకు వెంటనే మరమ్మతులు చేయిస్తాం. శౌచాలయాల నిర్వాహణకు సిబ్బంది కొనసాగుతున్నారు. మార్కెట్ ఆవరణ నిత్యం పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకుంటాం. భవనాన్ని వినియోగించుకునేలా ప్రత్యామ్నాయ ఆలోచనలు చేస్తున్నాం.



ఘనంగా భోగ్ బండార్

శివ్వంపేట, న్యూస్‌టుడే: మండల పరిధి బీక్యాతండా పంచాయతీ పరిధిలో సేవాలాల్ జగదాంబ గుట్ట ఆలయంలో దీక్షలు తీసుకున్న సందర్భంగా గురువారం భోగ్ బండార్ నిర్వహించారు. 21 రోజులు పూర్తయ్యాక మహారాష్ట్రలోని పౌరాదీవిలో దీక్ష విరమిస్తారు. సేవాలాల్ జగదాంబ ఆలయ వ్యవస్థాపకుడు మూడ్ సూర్యం చౌహాన్, మునోత్ రవినాయక్, తిరుపతి, శ్రీనివాస్‌చౌహాన్, వసురాం, కుమార్ పాల్గొన్నారు.

కుంట ఆక్రమించి.. దారి మూసేసి



తహసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తున్న గ్రామస్థులు

శివ్వంపేట: కొంతాన్‌పల్లి శివారులోని కరీంకుంట, మసానికుంట శిఖాలు కబ్జా చేసిన రియల్ వ్యాపారి కంచె వేసి దారి మూసేశాడని గ్రామస్థులు గురువారం తహసీల్దార్ కమలాద్రికి ఫిర్యాదు ఇచ్చారు. ఉపాధిహామీలో వేసిన దారి మూసివేయడంతో చేపలు పట్టేందుకు వెళ్లడానికి ఇబ్బందులు పడుతున్నామని బెస్తవారు వాపోయారు. విచారించి పంట పొలాలకు వెళ్లేందుకు దారి ఇప్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు.

సృజనాత్మక బోధన మేలు

చేగుంట: ఉపాధ్యాయులు విద్యార్థులకు సృజనాత్మకతతో బోధించాలని ఎంఈవో నీరజ అన్నారు. గురువారం మండలంలోని బోనాలలో మండల పాఠశాల సముదాయ సమావేశం నిర్వహించారు.